సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



గీత దాటితే.. వేటే!

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. వివరాలు 10లో ▸



నచ్చలేదా.. 'నోటా' నొక్కేస్తున్నారు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోయినా గతంలో ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేసేవారు. కానీ... వివరాలు 10లో ▸



అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరులో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి హెచ్చరించారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రీఫిల్లింగ్ కేంద్రంపై దాడులు

591 సిలిండర్ల స్వాధీనం



సిలిండర్లతోపాటు నిందితుడిని చూపుతున్న పోలీసులు

సంగారెడ్డి టౌన్: అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై అధికారులు దాడులు నిర్వహించారు. ఆదివారం సంగారెడ్డి మండలం గొల్లగూడెంలో కొట్టగండి అంబాదాస్, నవీన్‌కుమార్ అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశారు. ఇందులో లారీలో కమర్షియల్ సిలిండర్స్ ఖాళీవి 234, షెడ్‌లో కమర్షియల్ సిలిండర్స్ ఖాళీవి 234, ఫుల్ సిలిండర్స్ 101, ఆటోలో డోమెస్టిక్ సిలిండర్స్ ఖాళీవి 6, గ్యాస్ డోమెస్టిక్ సిలిండర్స్ ఫుల్ 10, చిన్న సిలిండర్స్ ఖాళీవి 06లను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణంలో చిరుజల్లులు



కురుస్తున్న వర్షం

సంగారెడ్డి అర్బన్: పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం లోపు ఒక్కసారిగా చిరుజల్లులు కురియడం మొదలైంది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే వానలో తడవకుండా ఉండేందుకు అందుబాటులో ఉన్న దుకాణ ప్రాంగణాల వద్దకు, చెట్ల కిందకు వెళ్లి వారు తలదాచుకున్నారు. రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొనడం తెలిసిందే.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం మండల పరిధిలోని చందాపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి శ్రీశైలం(40) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 20 రోజుల క్రితం కుక్కకాటుకు గురయ్యాడు. అప్పటి నుంచి వింతగా ప్రవర్తిస్తున్నాడు. కాగా తెల్లవారుజాము 5 గంటలకు ఇంట్లో నుంచి లేచి బయటకు వెళ్లి రాలేదు. గ్రామశివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఉరేసుకొని గ్రామస్తులకు విగతజీవిగా కనిపించాడు. వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీపీఎం అభ్యర్థి మల్లికార్జున్‌కు బీఫామ్



మల్లికార్జున్‌కు బీఫామ్‌ను అందజేస్తున్న చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: సీపీఎం పటాన్‌చెరు అభ్యర్థి జొన్నలగడ్డ మల్లికార్జున్‌కు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు చుక్క రాములు బీఫామ్ అందజేశారు. సోమవారం మండలంలోని ఇస్నాపూర్‌లో జరిగిన నియోజకవర్గ వర్క్‌షాప్‌లో అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఎంను ప్రజలు, కార్మికులు గెలిపించాలని కోరారు.

చంద్రశేఖర్ తరఫున ఎంపీపీ గిరిధర్‌రెడ్డికి బీఫామ్



చంద్రశేఖర్ తరఫున బీఫామ్ తీసుకుంటున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ తరఫున పార్టీ కోఆర్డినేటర్, ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి బీఫామ్ అందుకున్నారు. సోమవారం గాంధీభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి దీపదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి రోహిత్ నుంచి గిరిధర్‌రెడ్డి బీఫామ్ తీసుకున్నారు. కాగా చంద్రశేఖర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో ఉన్నారు.

నిరీక్షణ



- బీజేపీ సంగారెడ్డి టికెట్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ
- నేడో, రేపో తుదిజాబితా ప్రకటన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి బీజేపీ టికెట్‌పై ఉత్కంఠ వీడటం లేదు. నామినేషన్ల దాఖలుకు కేవలం మూడు రోజులే గడువున్నప్పటికీ అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. మరోవైపు పోటీ పడుతున్న ఆశావహులకు నిరీక్షణ తప్పడం లేదు. పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పులిమామిడిరాజులిద్దరూ ఆశిస్తున్నారు. బండి సంజయ్ ఆశీస్సులతో ఒకరు, ఈటల రాజేందర్ సపోర్టుతో మరొకరు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశంపై కమలం శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ టికెట్ రేసులో పార్టీ నాయకులు శివరాజ్‌పాటిల్ కూడా ఉండేవారు. ఇటీవల ఆయన పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో దేశ్‌పాండే, పులిమామిడిరాజు మధ్య పోటీ నెలకొంది. జిల్లాలో బీజేపీకి కొంత పట్టున్న నియోజకవర్గాల్లో సంగారెడ్డి ఒకటి. గతంలో ఈ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. సంగారెడ్డి, సదాశివపేట





రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే　పులిమామిడి రాజు

మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ స్థానాలను సైతం గెలుచుకుంది. నియోజకవర్గంలో పలు మండలాల్లోనూ కొంత ఓటు బ్యాంక్ ఉంది. ఇంకా టికెట్ ఖరారు చేసేందుకు జాప్యం జరుగుతుండటం కూడా పార్టీ శ్రేణులను నిరాశకు గురిచేస్తోంది.

అన్ని చోట్ల ప్రకటన కానీ..

జిల్లాలో ఒక స్థానానికి తప్ప మిగతా వాటికి బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. మొదటి, మూడో జాబితాల్లో జిల్లాలోని పటాన్‌చెరు, ఖేడ్, అందోల్, జహీరాబాద్ టికెట్లను ఖరారు చేసింది. కానీ సంగారెడ్డి విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు.

ప్రచారంలో వెనుకంజ..

సంగారెడ్డి నియోజకవర్గం టికెట్ల ఖరారు విషయమై జాప్యం జరుగుతుండగా బీజేపీ ప్రచారంలో కాస్త వెనుకబడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను రెండు, మూడు సార్లు చుట్టేశారు. అన్ని కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలను కూడా నిర్వహించారు. ప్రత్యర్థి పార్టీల్లోని కీలక నాయకులను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోవడం మరింత పకడ్బందీగా ఎన్నికల వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఇటు కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి కూడా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఆ పార్టీ జాతీ య అధ్యక్షుడు ఖర్గే సమావేశాన్ని సంగారెడ్డిలో నిర్వహించారు. ఒక్క బీజేపీ మాత్రం ఇంకా టికెట్ ఖరారు కాకపోవడంతో ప్రచారం ముందుకు వెళ్లలేకపోతోంది.

నేడో, రేపో ప్రకటన

రాష్ట్రంలో బీజేపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల తుది జాబితా మంగళ, బుధవారం కానీ ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనసేన పార్టీకి కేటాయించే నియోజకవర్గాల విషయంలో ఇప్పటికే ఓ స్పష్టత రాగా తుదిజాబితా ప్రకటనకు మార్గం సుగమమైందనే అభిప్రాయం పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

పటాన్‌చెరుకు నీలం, ఖేడ్‌కు షెట్కార్



నీలం మధు



సురేశ్ షెట్కార్

- ఖరారు చేసిన కాంగ్రెస్
- అసమ్మతి భగ్గుమనే అవకాశం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పటాన్‌చెరు, నారాయణఖేడ్ స్థానాల టికెట్ల కేటాయింపుపై కొనసాగుతున్న ఉత్కంఠకు కాంగ్రెస్ పార్టీ తెర దింపింది. పటాన్‌చెరు టికెట్‌ను ఇటీవల ఆ పార్టీలో చేరిన నీలం మధు ముదిరాజ్‌కు, నారాయణఖేడ్ టికెట్ మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు ఖరారు చేసింది. పటాన్‌చెరు టికెట్ కోసం నీలం మధుతోపాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆశించారు. కాగా తీవ్ర తర్జనభర్జనల తర్వాత మధు వైపు అధిష్టానం మొగ్గు చూపింది. చిట్కుల్ సర్పంచ్‌గా ఉన్న నీలం బీఆర్‌ఎస్ నుంచి ఇదే స్థానానికి టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కండువా కప్పుకున్న విషయం విదితమే.

షెట్కార్‌కే నారాయణఖేడ్ టికెట్

మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు నారాయణఖేడ్ టికెట్ దక్కింది. దీనికోసం ఆయనతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తీవ్ర ప్రయత్నం చేశారు. ఇక్కడ పార్టీ రెండు వర్గాలుగా ఉంది. కొన్నేళ్లుగా ఎవరికి వారే అన్నట్లుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ టికెట్ తమ నాయకుడికే దక్కుతుందని ఇద్దరు నేతల అనుచరులు చెప్పుకొచ్చారు. ఇక్కడ రెండు వర్గాలు కలిసి పనిచేస్తేనే కాంగ్రెస్ గెలుపు సాధ్యమవుతుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.

స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగుతారా..?

ఈ రెండు టికెట్ల ప్రకటనతో అసమ్మతి భగ్గుమనే అవకాశం ఉండగా కాంగ్రెస్ అధిష్టానం చివరి వరకు వేచి చూసే ధోరణిని అవలంబించిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. టికెట్ దక్కని శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సంజీవరెడ్డి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తారా? లేదా అసమ్మతి రాగం ఆలపించి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగుతారా.? అనేది ఒకటీ నేడో, రేపో దీనిపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మాది సంక్షేమ ప్రభుత్వం

బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుకున్నారని బీఆర్‌ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దేవుని గుట్టతండా, భీమ్లా తండా, లింగేగుట్ట తండా, తెల్లరాళ్ల తండా, గోవిందరాజ్‌పల్లి, లింగాపూర్, చీక్ మద్దూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతు సంక్షేమం కోసం కేసీఆర్ రైతు బీమా, రైతుబంధు పథకాలను అమలు చేసిందన్నారు. అలాగే పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంటున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆసరా పింఛన్, అన్నపూర్ణ పథకం, కేసీఆర్ ఆరోగ్య రక్ష సౌభాగ్య లక్ష్మి, గృహలక్ష్మి తదితర పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. ఒక్క నర్సాపూర్ నియోజకవర్గంలోనే 54 గిరిజన తండాలను నూతనంగా గ్రామ



పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను రూ.1100లకు చేసిందని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రూ.400 సిలిండర్ ఇస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజేందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పీఎస్‌సీఏ చైర్మన్లు దుర్గారెడ్డి, దామోదర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, వీరేశంగౌడ్, సతీశ్, నరేందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎంపీపీ వావిలాల నర్సింలు ప్రచారం మొదలు కాగానే మధ్యలో నుంచి వెళ్లిపోయారు. కొంతమంది నాయకులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఎమ్మెల్యే మదన్ రెడ్డి, సునీతారెడ్డి స్వయంగా ఎంపీపీ ఇంటికెళ్లి నచ్చజెప్పారు.

మూడోరోజు 11 నామినేషన్లు

సంగారెడ్డి: నామినేషన్ల స్వీకరణ మూడో రోజైన సోమవారం నాడు జిల్లాలో 11 మంది పత్రాలను సమర్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి శరత్ సోమవారం తెలిపారు. అందోల్‌లో, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి, పటాన్‌చెరులో మూడు, నారాయణఖేడ్ ఒకటి, సంగారెడ్డి నుంచి ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు.

- జహీరాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థిగా అలిగె ప్రవీణ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. అందోల్‌లో బీజేపీ అభ్యర్థి బాబుమోహన్ తరఫున పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మఠం చంద్రశేఖర్ సోమవారం ఎన్నికల ఆర్‌ఓ పాండుకు నామినేషన్ అందజేశారు. నారాయణఖేడ్‌లో బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) అభ్యర్థిగా మహిపతి ప్రకాశ్ రాథోడ్ నామినేషన్ వేశారు.
- పటాన్‌చెరులో స్వతంత్ర అభ్యర్థిగా గట్టు సత్యనారాయణ, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ తరఫున కొత్త బలిజ బస్వరాజ్, స్వతంత్ర అభ్యర్థిగా కాత్యాయని కుంభ, అలియాన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ నుంచి ఒక్కటి, మరొకటి స్వతంత్ర అభ్యర్థిగా మరమునిి శ్రీశైలం యాదవ్ రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు.



ఆర్‌ఓకు బాబుమోహన్ తరఫున నామినేషన్ పత్రాలను అందజేస్తున్న చంద్రశేఖర్

లింగాయత్‌లకు ప్రాధాన్యం

ఎంపీ పాటిల్

వట్‌పల్లి(అందోల్): వీరశైవ లింగాయత్ సమాజాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. సోమవారం వట్‌పల్లిలో జరిగిన వీరశైవ లింగాయత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సీఎంకు బసవేశ్వరుడంటే ఎంతో గౌరవమన్నారు. ట్యాంకు బండ్‌పై ఆయన విగ్రహం పెట్టించారన్నారు. ఆయన జయంతిని తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా జరపాలని ఉత్తర్వులు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్‌యేనని చెప్పారు. కోకాపేటలో బసవేశ్వ భవన్ కోసం రూ.100 కోట్ల విలువైన భూమిని కేటాయించారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ తన హయాంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. వ్యవసాయాన్ని పండగ చేసింది కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్థానిక బిడ్డగా తనకు అందరూ మద్దతుగా నిలబడి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈనెల 27న అందోల్‌లో జరిగే సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ కులస్తులు క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఉంటామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు సురేఖ, ఎంపీపీ పత్రి కృష్ణవేణి, జెడ్పీటీసీ పత్రి అపర్ణ, ఎంపీటీసీ ఇందిర, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, సర్పంచ్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పటేల్

అతిగా మద్యం తాగిన వ్యక్తి..

బొల్లారంలో ఘటన

జిన్నారం(పటాన్‌చెరు): అతిగా మద్యం తాగి నడుచుకుంటూ వస్తూ అదుపు తప్పి కింద పడిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ నయీమొద్దీన్ కథనం ప్రకారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని వెంకట్‌రెడ్డి నగర్‌లో భూపతి వెంకటేశ్వరరావు(60) నివాసం ఉంటున్నాడు. అనారోగ్యంగా ఉండటంతోపాటు అతిగా మద్యం తాగి ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డుపై వెంకటేశ్వరరావు పడిపోయాడు. పడిపోయిన చోటే ప్రాణాలు విడిచాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గెలిపిస్తే అందోల్‌ను అభివృద్ధి చేస్తా

బీజేపీ అభ్యర్థి బాబుమోహన్

జోగిపేట (అందోల్): తనను గెలిపిస్తే అందోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి బాబుమోహన్ అన్నారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అందోల్ నియోజకవర్గంలో తాను చేసిన సేవలు, అభివృద్ధి పనులకు ప్రజలు ఆదరించి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా మిషన్ భగీరథ రాక ముందే ప్రతి ఇంటికీ తాగునీరు, వ్యవసాయానికి మూడు పంటలకు సాగు నీరు అందించానన్నారు. 1998 ఉప ఎన్నికల్లో గెలిచి అన్ని గ్రామాల్లో రోడ్లు వేశానన్నారు.



ఇప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కనీసం వాటికి మరమ్మతులు సైతం చేయించ లేదన్నారు. తాను చెరువులు పూడికలు తీయిస్తే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చెరువులో మట్టి వేసి కబ్జా చేశారని ఆరోపించారు. బీజేపీ నుంచి నామినేషన్ వేస్తున్నానని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, కో–కన్వీనర్ సుమన్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జగన్నాథం, వట్‌పల్లి మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకులు కార్తీక్ గౌడ్, శివచందర్, అర్జున్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యే జగ్గారెడ్డి

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): ఏ రోజు కూడా సంగారెడ్డి ప్రజలకు అందుబాటులో లేని జగ్గారెడ్డిని ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలపరిధిలోని అనంతసాగర్, సైదాపూర్, గోటిలగుట్ట, మాచేపల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో మరింత అభివృద్ధి జరగాలంటే కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. పేదలు, రైతుల సంక్షేమం కోసం రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గత ఎన్నికల్లో జగ్గారెడ్డి ఆచరణకు సాధ్యం కానీ అనేక హామీలను ఇచ్చి, ప్రజలను మోసం చేసి గెలిచాడని మండిపడ్డారు. ఇక ఏ రోజు గ్రామాల్లో తిరిగి ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజల మద్దతు ఉన్నందునే కేసీఆర్ మరోసారి ఎమ్మెల్యేగా సేవ చేసుకునేందుకు అవకాశం కల్పించారని, తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, పట్నం మాణిక్యం,నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రచారం

జహీరాబాద్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రచారం చేశారు. సోమవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రచారం నిర్వహించామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

జగదేవ్‌పూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండలం కొత్తపేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లిలో నెలకొన్న భూసమస్యకు సీఎం కేసీఆర్ చొరవతో పరిష్కారం లభించిందని అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో సీఎం కేసీఆర్‌కే తమ మద్దతు అంటూ గ్రామస్తులు సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

500 నామినేషన్లు వేస్తాం

లక్డారం గ్రామస్తుల స్పష్టీకరణ – భిక్షాటనతో నిరసన



భిక్షాటన చేస్తున్న గ్రామస్తులు

పటాన్‌చెరు టౌన్: గ్రామంలో క్రషర్లు ఎత్తివేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామస్తులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొంతకాలంగా స్థానికంగా ఏర్పాటు చేసిన 42 కంకర క్రషర్ మిషన్ వల్ల ఇబ్బందులు పడటమే కాకుండా, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని ఎత్తివేయాలని 258 రోజులుగా దీక్ష చేపట్టిన ఎవరూ స్పందించలేదన్నారు.

దీంతో ఎన్నికల్లో గ్రామం నుంచి 500 నామినేషన్లు వేయదల్చామన్నారు. ఆర్థిక స్థోమత సరిపోక పోవడంతో భిక్షాటన చేస్తున్నామని వారు తెలిపారు. ప్రభుత్వం నుంచి క్రషర్లు ఎత్తి వేస్తామని, స్పష్టమైన హామీ వస్తే గానీ విరమించబోమని స్పష్టం చేశారు.

'స్వీప్'పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచన

సంగారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, అందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నోడల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగ ఓటర్ల మార్కింగ్ చేసిన జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలవారీగా ఎంతమందికి రవాణా సౌకర్యం అవసరమో రెండు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారికి సూచించారు. 80 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యంగులు వారి ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు ఉందన్నారు. పరిశ్రమల్లో పని చేస్తున్న వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు 712 పరిశ్రమల్లో ఉన్న వారికి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యవంతులను చేశామని అధికారులు వివరించారు. రేపటి నుంచి స్పెషల్ మొబైల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని పోలింగ్ స్టేషన్‌లవారీగా దివ్యాంగులకు వీవీ ప్యాట్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ నగేశ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివలింగయ్య, డీడబ్ల్యూఓ సంధ్యారాణి, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో.. ఓటరు ఐడీ కార్డ్

చిన్నకోడూరు(సిద్దిపేట): కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఓటరు ఐడీ కార్డు రావడం ఆలస్యం అవుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా కల్పించిన వెసులుబాటుతో ఇంట్లో నుంచే ఓటరు ఐడీ కార్డును క్షణాల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేలాగో ఇప్పుడు చూద్దాం..

ఆన్‌లైన్‌లో పొందండిలా..

ముందుగా ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో voterrecgov.in లో లాగిన్ అవ్వాలి. తర్వాత హోమ్‌పేజీలో ఉన్న ఈ–ఎపిక్ డౌన్‌లోడ్ ఆప్షన్ ఎంచుకోవాలి. అనంతరం స్క్రీన్‌పై అడిగిన విధంగా మీ మొబైల్ నంబర్ లేదా ఈ మెయిల్ ఐడీ లేదా ఎపిక్ నంబర్‌ను ఎంటర్‌చేసి సబ్‌మిట్ బటన్ నొక్కాలి. తరువాత రిక్వెస్టు ఓటీపీపై క్లిక్‌చేస్తే మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నిర్దేశించిన బాక్స్‌లో నమోదు చేయాలి. చివరగా డిజిటల్ ఓటర్ ఐడీ కార్డును డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఈ–ఎపిక్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఓటరు ఐడీ పీడీఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ అవుతుంది. ఫిజికల్ కార్డు కావాలనుకునే వారు దగ్గర్లోని మీ సేవా లేదా ఇంటర్‌నెట్‌కు వెళ్లి ఓటర్ ఐడీ కార్డును ప్రింట్ తీసుకోవచ్చు.



తప్పిన తిప్పలు

ఈ ప్రక్రియతో ఎన్నికల సంఘం పంపే ఓటరు గుర్తింపు కార్డు కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. ఈ సౌలభ్యం గతంలోనూ ఉన్నప్పటికీ అది ఆమోదం పొందేందుకు చాలా సమయం పట్టేది. నమోదిత వివరాలు సంబంధిత అసెంబ్లీ ఎన్నికల అధికారి ఆమోదించిన తరువాతే ఆ ప్రక్రియ పూర్తయ్యేది.

నచ్చలేదా.. నోటా నొక్కేస్తున్నారు

- మెదక్ జిల్లాలో అభ్యర్థులపై పెరుగుతున్న వ్యతిరేకత
- గత ఎన్నికల్లో 2263 ఓట్లు పోల్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోయినా గతంలో ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేసేవారు. కొంత కాలంగా అభ్యర్థులపై తమ అయిష్టతను తెలియజేసేందుకు ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో ''నోటా'' ఆప్షన్‌ను జత చేసింది. దీంతో ఓటర్లు నోటా ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. బీఆర్‌ఎస్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఉపేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఆకుల రాజయ్య, బీఎస్పీ నుంచి దూడ యాదేశ్వర్, జనతా పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఇతర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. వారిలో పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఉపేందర్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. కాగా బీజేపీ అభ్యర్థి ఆకుల రాజయ్య డిపాజిట్ కోల్పోయారు. ఇక మిగతా వారి సంగతి అంతంత మాత్రమే. ఈ ఎన్నికల్లో 899 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మొత్తం 1,68,911 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 2263 మంది నోటాకు ఓటేసి అభ్యర్థులపై తమ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో వివిధ శాఖల ద్వారా అత్యవసర సేవలు అందించే అధికారులకు కేటాయించే 899 పోస్టల్ బ్యాలెట్‌లలో 49 ఓట్లు చెల్లకుండా పోగా, 3 ఓట్లు నోటాకు పడడం గమనార్హం. ఇప్పటికీ ''నోటా'' అనే మీట ఉందనే విషయం చాలా మంది ఓటర్లకు తెలియదు. అందువల్లే నోటాకు ఓట్లు తక్కువగా పడుతున్నాయని విద్యావంతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును నోటాకు కాకుండా సరైన నాయకుడికి వేసి అభివృద్ధికి దోహద పడాలని మేధావులు సూచిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో నోటాను మీటే ఓట్లు ఎన్నో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.





క్లుప్తంగా

కాంగ్రెసోళ్లను నమ్మి మోసపోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ నాయకులకు ఒక్కసారి కాదు.. 11సార్లు 55 ఏళ్ల చాన్స్ ఇచ్చినా ఎలాంటి అభివృద్ధి చేయలేక పోయారని ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ అన్నారు. సోమవారం మండలంలోని మల్లంపల్లి, పెద్ద తండా, జనగామ, అంతక్కపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు.. కాంగ్రెస్ హయాంలో తండాల్లో గుక్కెడు తాగునీళ్లు కూడా దొరకలేదని, బిందెలు పట్టుకొని పొలాలకు పరుగులు పెట్టారని గుర్తు చేశారు. గిరిజనులంతా బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని అన్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తిరుపతినాయక్, రాంచందర్‌నాయక్, రాజునాయక్, సత్యంనాయక్, వీరన్న నాయక్, శ్రీనివాస్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రసమయి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రచార సభలో స్థానిక ఎంపీటీసీ భర్త మధుసూదన్‌రెడ్డిపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మధుసూదన్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అతను పార్టీ మారి ఓట్లు ఎలా అడుగుతాడని మాట్లాడటంతో గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.

-నారాయణఖేడ్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నాయకులు ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించనుంది. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రచారాలకు దూరంగా ఉండాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొనడం నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుంది. జిల్లాలో ఉద్యోగుల ప్రవర్తన తీరు గురించి అక్కడక్కడ వస్తున్న ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు.

గీత దాటితే.. వేటే!

- ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్ జాగ్రత్త
- చాటుమాటు ప్రచారం చేసినా వేటు తప్పదు
- ప్రత్యేక నిఘా పెట్టిన ఎన్నికల సంఘం



గత అనుభవాల దృష్ట్యా..

గతంలో జరిగిన ఎన్నికల్లో కొందరు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, సాటి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లు ఒక పార్టీకి వేసేలా ఒత్తిడి తెచ్చిన ఘటనలు జరిగాయి. కాగా ఈ సారి కోడ్ ఉల్లంఘనపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. గతంలో రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ఉద్యోగులు తిరగాడడం, కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా ఈ మారు అలా జరగకుండా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పటిష్ట నిఘా..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ప్రచార సమయంలో వీడియో రికార్డింగ్ పకడ్బందీగా చేయిస్తోంది. ఇలా చేసిన రికార్డింగ్‌ను పరిశీలన బృందం అధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తుంటారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు గమనిస్తే ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులపై వేటు వేయడం లేదా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. అదే విధంగా సోషల్ మీడియాను సైతం మీడియా మానిటరింగ్ బృందం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. పార్టీలకు అనుకూలంగా, ప్రతికూలంగా పోస్టులు పెట్టినా ఎన్నికల సంఘం చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది.

ఇవీ నిబంధనలు..

ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు. తన కిందిస్థాయి ఉద్యోగులను, ఇతరులను ఫలానా పార్టీకి ఓటు వేయాలని ఒత్తిడి చేయకూడదు. ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు. రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు. సోషల్‌మీడియాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టకూడదు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు.

ఓ అధికారిపై చర్య

ఇటీవల జిల్లాలోని ఓ మండల స్థాయి అధికారి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడన్న ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి తక్షణం స్పందించి విచారణ చేశారు. సదరు అధికారి సంజాయిషీ తీసుకున్నారు. దానికి సంతృప్తి చెందని అధికారులు అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మీకు ఈ సంగతి తెలుసా?



పాపన్నపేట(మెదక్): పోలింగ్ బూత్‌లో టెండర్ ఓటు, చాలెంజ్ ఓట్ల గురించి మాట్లాడుకుంటుంటే వింటుంటాం. అసలు వీటి గురించి చాలామందికి తెలియదు. ఇప్పుడు వాటి వివరాలు తెలుసుకుందాం. తమ ఓటు గల్లంతయ్యిందని ఫిర్యాదు చేసే వ్యక్తుల కోసం ఎన్నికల సంఘం 'టెండర్ ఓటు' ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఓటరు ఓటు వేయవచ్చు. ఎన్నికల సంఘం నిబంధనలలోని సెక్షన్ 42 ప్రకారం 'టెండర్ ఓటు' ఏర్పాటు చేశారు. మీరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు.. అప్పటికే మీ ఓటు ఎవరైనా వేస్తే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అధికారి పరిశీలించి మీ గుర్తింపును ధ్రువీకరిస్తారు. దీని తర్వాత మీరు టెండర్ ఓటును డిమాండ్ చేయవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఈవీఎం ద్వారా ఓటు వేయలేరు. బ్యాలెట్ సాయంతోనే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

చాలెంజ్ ఓటు..

ఓటింగ్ జరుగుతున్నప్పుడు పోలింగ్ స్టేషన్‌లో చాలెంజ్ ఓటుకు అవకాశం ఉంటుంది. దీని ద్వారా అక్రమ ఓటర్లను అడ్డుకోవచ్చు. ఎన్నికల ఏజెంట్లు ఈ చాలెంజ్ ఓటును ఉపయోగించుకుంటారు. దీని కోసం రూ.2 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వచ్చినప్పుడు, అతను నకిలీ ఓటర్ అని ఏజెంట్ అనుమానించినప్పుడు చాలెంజ్ ఓటు ఉపయోగపడుతుంది. పోలింగ్ ఏజెంట్ ప్రిసైడింగ్ అధికారి ఎదుట చాలెంజ్ ఓటు వేస్తాడు. రూ.2 రుసుం కూడా చెల్లిస్తాడు. అప్పుడు ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రిసైడింగ్ అధికారికి అతను సరైన ఓటరు కాదని తెలియజేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరు దగ్గరున్న పత్రాలను తనిఖీ చేసి, అవి సరిగా ఉంటే ఓటరుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఎన్నికల ఏజెంట్ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటరును ఓటు వేయకుండా అడ్డుకుంటారు.



దొరల రాజ్యాన్ని తరిమికొడదాం

దుబ్బాక: దొరల, రెడ్డిల పాలనతో దుబ్బాక అభివృద్ధికి నోచుకోలేదని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి వెంకట ప్రసన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ కోరారు. సోమవారం ఆయన పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలో అణగారిన కులాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తమ పార్టీ ఎన్నికల్లో ముందుకు సాగుతుందన్నారు. అవినీతి ప్రభుత్వాలకు చరమగీతం పాడాలన్నారు.

ఉద్యమంలో పోరాడిన చరిత్రే.. నా ఆస్తి

కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ సోమవారం నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకొని సైదాపూర్ మండలానికి వెళ్తున్న క్రమంలో హుజూరాబాద్ శివారులో ఆయన వాహనాన్ని ఎన్నికల కోడ్ అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న సూట్ కేసును చూసిన పోలీస్‌లు అందులో ఏమి ఉన్నాయని ప్రశ్నించగా, ఇది నా ఆస్తి.. చూపించమంటారా అని పొన్నం దానిని తెరిచి చూపించారు. అందులో ఆయనకు సంబంధించిన తెలంగాణ చరిత్ర, పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే దాడికి గురైనప్పటి దృశ్యాలు, ప్రధాని మన్మోహన్ సింగ్, పలువురి ఎంపీలు, సోనియాగాంధీతో సమావేశమైన చిత్రాలు కనిపించాయి.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన నాయకులు ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లి, అల్వాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆత్మ గౌరవాన్ని సిద్దిపేట నాయకులకు తాకట్టు పెట్టేవారు కావాలా.. అభివృద్ధి చేసేవారు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దుబ్బాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎంపీపై జరిగిన కత్తి దాడితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ బురద జల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల రాజేష్, రత్నారెడ్డి, మహేష్, జహంగీర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుందాం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిని మండలంగా మార్చిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండలం రాంచంద్రాపూర్, తిప్పారం, కుకునూరుపల్లి, మాత్‌పల్లి, కోనాయిపల్లి, మేదినీపూర్ విశ్వనాతపల్లి, రవీంద్రనగర్, వెలికట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో, బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార దాహం కోసం కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ల మాదిరిగా తిరుగుతున్నారన్నారు. మండలం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో దేవి రవీందర్, కోల సద్గుణ, పిస్క అమరేందర్, మడుపు భూంరెడ్డి, కాచం నవీన్ కుమార్, పొల్కంపల్లి నరేందర్, మల్లం ఐలయ్య, శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, రుషీ, కనకయ్య, సంపత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి పెరిగిన ఆదరణ

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరిగిందని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రొయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో హస్తం పార్టీ విజయం ఖాయమన్నారు. నీరుడి పోచయ్య, జిల్లా వెంకటేష్, నీరుడి సత్యనారాయణ, పటేల్ దాసు, వీరేశం, రాములు, సామయ్య, సాయిలు, అంతరం భిక్షపతి, భిక్షపతి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంఏ. హకీమ్, కొన్యాల వెంకటేశం, రియాజ్ అలీ, మన్నే నర్సింలు, ప్రశాంత్ గౌడ్, కత్తుల సత్యనారాయణ, ఈసు బాబా, హరి శంకర్ గౌడ్, గౌడి శ్రీనివాస్, అరవింద్, ప్రసాద్ యాదవ్, భాను, అజయ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే.. దుబ్బాక సమస్యలన్నీ పరిష్కరిస్తా

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): గెలిచిన రెండేళ్లుగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి, పోతాన్‌పల్లి, పోతాన్‌శెట్టిపల్లి, నడిమి తండాలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో ఉండే నాయకుడికే సమస్యల గురించి తెలుస్తుందని చెప్పారు. అందరి సమస్యలు తెలిసిన తనను గెలిపిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం చందాయిపేట దుర్గమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యేను తులాభారం వేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, భూపాల్, నాగేందర్‌రెడ్డి, హరిప్రసాద్, అంజాగౌడ్, జగన్‌గౌడ్, నాగభూషణం, గణేష్, రఘువీర్, కర్ణపాండు, జ్యోతి,లావణ్య, రమ్య పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపూర్, అందె గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, కొండాపూర్ ఉప సర్పంచ్ జిగిరి అమర్, నాయకులు భిక్షపతి, నిఖిల్, భాను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు'

హుస్నాబాద్: కేసీఆర్ లేకుంటే తెలంగాణ గురించి మాట్లాడేవారే లేరని, కోదండరాంకు ఏమి తెలుసని ఇక్కడికి వచ్చి విమర్శిస్తున్నారని హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ మండిపడ్డారు. సోమవారం హుస్నాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం 360 మంది విద్యార్థులను బలి తీసుకుంది కాంగ్రెస్సేనని అన్నారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో మూడు సార్లు ఓడిపోయి, మళ్లీ హుస్నాబాద్‌కు వచ్చాడని.. ఇక్కడ కూడా ఓడిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో ఎడబోయిన తిరుపతి రెడ్డి, దండుగుల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని.. ఇంట్లో నుంచి వెళ్లి..

కాలువలో శవమై తేలిన బాలుడు

గజ్వేల్‌రూరల్: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ బాలుడు మరునాడు కాలువలో శవమై తేలిన ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాయిని యాదగిరి–వాణి దంపతులకు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వీరి పెద్దకొడుకు చరణ్(11) రిమ్మనగూడలోని పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తల్లిని డబ్బులు అడగడంతో చరణ్‌ను మందలించింది. దీంతో అతను ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు గ్రామ సమీపంలోని కాళేశ్వరం ప్రాజెక్టు కాలువలో చరణ్ మృతదేహం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ వద్దకు వెళ్లిన పిల్లవాడు ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్రాడ్ కేసులో జరిమానా

జిన్నారం(పటాన్‌చెరు): ఉద్యోగుల పీఎఫ్ డబ్బును సొంత అవసరాలకు ఉపయోగించుకున్న కేసులో ఒకరికి సోమవారం కోర్టు జరిమానా విధించింది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాలు. బొల్లారంలోని టర్బో మిషనరీ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో తోట సుబ్బారాయుడు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2014లో ఉద్యోగుల పీఎఫ్ నగదు రూ.2,10,722 ను ఆయన వాడుకున్నాడు. అప్పటి ఎస్ఐ ప్రశాంత్‌కు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై సంగారెడ్డి ప్రథమ శ్రేణి, ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి అనిత సుబ్బరాయుడికి రూ.3వేల జరిమానా విధించారు.

మా రూటే సపరేటు..

దుబ్బాకలో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని 14, 17 వార్డులలో ఆ పార్టీ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో మాస్కులు ధరించి ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భూంరెడ్డి, బాలకిషన్ గౌడ్, వంశీకృష్ణ గౌడ్, ఖలీల్, తదితరులున్నారు.

- దుబ్బాక



ప్రభాకర్‌రెడ్డి మాస్కులతో నాయకులు